



విజయవాడలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

'జూమ్' పాలన..!

ప్రజలకు అందుబాటులో ఉండని అధికారులు

రోజంతా జూమ్ మీటింగ్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లతోనే బిజీ

గ్రామస్థాయి నుంచి జిల్లా వరకూ ఇదే పరిస్థితి

ప్రజల సమస్యలు వినే పరిస్థితి కరువు

కార్యాలయాలకు వచ్చిన ప్రజల్లో తీవ్ర అసహనం


పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదిస్తే తప్పడు ఎండార్స్‌మెంట్లతో మూసివేత

'రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యను చెప్పుకునేందుకు ఓ వ్యక్తి తహశీల్దార్ కార్యాయానికి వెళ్లాడు. సార్.. జూమ్ మీటింగ్‌లో ఉన్నారని చెప్పారు. గంటల తరబడి వేచిచూసినా సదరు అధికారిని కలవలేకపోయారు. ఒకదాని వెనుక మరో మీటింగ్ కొనసాగాయి. ఇక ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్తే సార్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారంటూ సమాధానం చెప్పారు. దీంతో ఏం చేయాలో తెలీక ఇంటిముఖం పట్టాల్సిన పరిస్థితి నెలకొంది'.

'గ్రామంలో తాగునీటి సమస్య చెప్పకునేందుకు మండలాధికారి వద్దకు రెండు రోజులు వరుసగా వెళ్లిన వ్యక్తికి వచ్చిన సమాధానం ఒక్కటే.. సార్ మీటింగ్‌లో ఉన్నారు. సమస్య ఏదైనా ఉంటే ఆఫీసులో ఇచ్చి వెళ్లాలని చెప్పారు. జిల్లా అధికారి వరకూ వచ్చారు. ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో బిజీగా ఉన్నారని చెప్పడంతో అక్కడ అందుబాటులో ఉన్న అధికారికి అర్జీ ఇచ్చి వెనుదిరిగారు. సమస్య మాత్రం పరిష్కారం కాని పరిస్థితి.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇలాంటి ఘటనలు ఏఒక్క శాఖకూ పరిమితం కాదు. జిల్లాలోని అన్నిశాఖల అధికారుల పరిస్థితీ ఇదేవిధంగా ఉంది. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకూ రోజంతా జూమ్ మీటింగ్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లో బిజీబిజీగానే ఉంటున్నారు. ఏదైనా పని మీద అధికారిని కలవాలంటే రోజంతా వేచిచూసినా సాధ్యమవుతుందో లేదో చెప్పలేని పరిస్థితి. దీంతో కూటమి ప్రభుత్వ 'జూమ్' మంతనాల పాలన సాగిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాలో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. ఎన్నో సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ శాఖలో భూములకు సంబంధించిన సర్వే లోపాలు, మ్యుటేషన్, పాసుబుక్ సమస్యలు, అన్‌క్లెయిమ్డ్ భూముల సమస్యలతోపాటు అనేక ఇబ్బందులు జనాలను వెంటాడుతున్నాయి. శానిటేషన్, తాగునీరు, రోడ్లు, ప్రభుత్వ భూముల కబ్జా వంటి సమస్యలు కోకొల్లలు. తమ సమస్యలను అధికారులకు విన్నవించుకుందామంటే ఏఒక్కరూ అందుబాటులో లేని పరిస్థితి ఉంటోంది. రోజంతా మీటింగ్‌లు, వాటిపై నివేదికలు సమర్పించడంతోనే అధికారులు బిజీగా ఉంటున్నారు. గత్యంతరం



లేని పరిస్థితుల్లో పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే అది పరిష్కరించకుండానే అధికారులు ఎండార్స్‌మెంట్లు ఇచ్చేస్తున్నారు. తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఇస్తున్న అధికారులపై ఎటువంటి చర్యలూ లేకుండాపోయాయి. దీంతో పిజిఆర్ఎస్ అనేది తూతూమంత్రంగా తయారైంది. జిల్లా అధికారులతో రాష్ట్రస్థాయి అధికారులు, తర్వాత జిల్లా అధికారులు మండలాల అధికారులతో, అనంతరం వారంతా గ్రామస్థాయి అధికారులతో రోజంతా జూమ్, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూనే ఉంటున్నారు. దీంతో అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశం లేకుండాపోతుంది. ప్రజల గోడు వినేవారే లేకుండాపోయారు. దీంతో జనం చిన్నపాటి సమస్యపై సైతం రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో ప్రజల వద్దకే పాలన అంటూ చెప్పిన టిడిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంగా ఏర్పడిన తర్వాత ప్రజలకు దూరంగా పాలన అన్నట్లు నడుస్తోంది.

దళారులు రంగ ప్రవేశం

సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలను దోచుకునేందుకు దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కొంతమంది రాజకీయ పార్టీల నాయకులే ఈ వ్యవహారం సాగిస్తున్నారు. ఎంఎల్ఎతో మాట్లాడతాం. సంబంధిత అధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. ఇంత ఖర్చవుతుందంటూ జనాలను పీడిస్తున్న పరిస్థితి ఉంది. రెవెన్యూ సమస్యలపై రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారు. పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాక పరిష్కారం కావాలన్నా తమ చేతులు తడపాల్సిందే అన్నట్లు మాట్లాడుతున్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో లేకపోవడం దీనికి కారణంగా చెప్పొచ్చు. పల్లెనిద్రలు, గ్రామాల్లో పర్యటించి జనంతో మమేకం కావడం వంటి కార్యక్రమాలు కనిపించడం లేదు. పింఛన్ల అందజేతలో సైతం తమకు దగ్గర్లో ఉన్న గ్రామానికి ఒక గంట వెళ్లి మళ్లీ మీటింగ్‌ల్లో బిజీ అయిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జూమ్ మీటింగ్‌ల పాలన కాకుండా, ప్రజల వద్దకు అధికారులు వెళ్లేలా పాలన సాగించాలని అంతా కోరుతున్నారు.

జెసి ధాత్రిరెడ్డి బదిలీ

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒగా నియామకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఐఎఎస్‌ల బదిలీల్లో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జెసిని నియమించే వరకూ అందుకు సంబంధించిన చర్యలు జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2024 జులై 24న ధాత్రిరెడ్డి జిల్లాలో జెసిగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు 14 నెలలపాటు జిల్లాలో విధులు నిర్వహించారు. ఫైల్స్ క్లియర్ చేయడంలో చాలా వేగంగా పని చేస్తారనే పేరును సంపాదించారు. ధాన్యం కొనుగోలులోనూ చురుకైన పాత్ర పోషించారనే ప్రశంసలను అందుకున్నారు. ఏజెన్సీలో జరుగుతున్న పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో స్థానిక రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా గిరిజనులకు అన్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నా కట్టడి చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. ఏడాదికిపైగా జిల్లాలో బాధ్యతలు నిర్వహించినా తనదైన ముద్రవేసుకోలేకపోయారనే చర్చ సర్వత్రా నెలకొంది.

డిపిఆర్ఒ రామచంద్రరావుకు ఎడిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



జిల్లా సమాచార శాఖలో డిపిఆర్ఒగా పని చేస్తున్న రామచంద్రరావుకు అసిస్టెంట్ డైరెక్టర్(ఎడి)గా ఉద్యోగోన్నతి లభించింది. ఆయనకు రాజమండ్రిలో పోస్టింగ్ ఇచ్చింది. ఒకటి, రెండు రోజుల్లో ఆయన అక్కడ విధుల్లో చేరనున్నారు. రామచంద్రరావు అత్యధికంగా దాదాపు 22 ఏళ్లపాటు ఉమ్మడి పశ్చిమ, విభజిత ఏలూరు జిల్లాలోనే పని చేశారు. టైపిస్ట్‌గా ఆయన తన ప్రస్థానం ప్రారంభించి అసిస్టెంట్ డైరెక్టర్ వరకూ ఎదిగారు. ఆయన వచ్చే ఏడాది జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు.

వార్త మెయిన్‌లో



కలెక్టరేట్ వద్ద పామాయిల్ కార్మికుల ధర్నా

గోదావరికి కొనసాగుతున్న వరద



పట్టిసీమ వద్ద నిండు కుండలా గోదావరి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

మూడు రోజులుగా గోదావరికి వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఆదివారం భద్రాచలంలో 36.6 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ సోమవారం నాటికి 39.4 అడుగులకు చేరింది. ఇప్పటికే మూడు రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వే ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గోదావరి మరో రెండు అడుగులు పెరిగితే ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై కాజ్వే ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో అవతల ఉన్న మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. గోదావరి క్రమంగా పెరుగుతుండటంతో మండలాల్లోని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద ఉధృతికి వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్వే మునిగి ఎడవల్లి, సిద్ధారం, తాళ్లగొంది, పూచిగొంది, కట్కూరు, కోయిదా తదితర సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరింత పెరిగితే మరిన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేలేరుపాడు-రుద్రంకోట రహదారిపైకి చేరిన వరద నీరు

పోలవరం నుంచి 6,98,782 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: ఎగువ రాష్ట్రాలు, ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, ఇంద్రావతి ఇతర నదుల జలాలు గోదావరిలో కలిసి గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు నుంచి 6,98,782 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 31.200 మీటర్లు, స్పిల్వే దిగువన 22.250 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 31.670 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 21.800 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య 16.060 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 10.40 మీటర్లుగా నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

అధికారులు చెప్పేదొకటి.. చేసేదొకటి

భూసేకరణ తీరుపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలో భూసేకరణ విషయంలో అధికారులు చెప్పేదొకటి.. క్షేత్రస్థాయిలో చేసేదొకటి అన్నట్లుగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. సోమవారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రం భవనం వద్ద ఆ పార్టీ మండల కమిటీ సమావేశం ఉడతా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్అండ్ఆర్ భూసేకరణలో గ్రామసభలు నిర్వహించకుండానే పీసా కమిటీ, పంచాయతీ సర్పంచులపై అధికారులు ఒత్తిడి తీసుకొచ్చి సంతకాలు చేయిస్తున్నారని, ఇది ఏజెన్సీ చట్టాలకు పూర్తి విరుద్ధమని అన్నారు. టైటిల్ చూస్తామని, భూమిపై పొజిషన్‌లో ఎవరున్నారో పరిశీలిస్తామని, గ్రామసభ ఆధారంగానే భూసేకరణ ఉంటుందని చెప్పిన జాయింట్ కలెక్టర్ మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న తీరుకు ఏమాత్రం సంబంధం లేదని, పూర్తి భిన్నంగా ఉందని అన్నారు. 30 ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టిఆర్, 1/70 చట్ట భూములను ఎటువంటి రికార్డు పరిశీలించకుండానే ఏకపక్షంగా ఆర్అండ్ఆర్‌లో కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఇది సరైంది కాదని అన్నారు. గ్రామ సభలోని టైటిల్ వెరిఫికేషన్ లింకు డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసి ఎటువంటి వివాదాలూ లేని భూముల్లో మాత్రమే ఆర్అండ్ఆర్ భూసేకరణ చేయాలని ఆయన కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో కొనుగోలు చేసిన ఆర్అండ్ఆర్ మిగుల భూముల సంగతి తేల్చాలన్నారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో ఈ భూములు ఉన్నాయని, వీటి వివరాలు బయట పెట్టి వాటిని నిర్వాసితులకు కేటాయించాలన్నారు. ఆ తర్వాతే అవసరమైన భూసేకరణ చేయాలని సూచించారు. సమావేశంలో మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నేతలు కారం భాస్కర్, పూనెం శేఖర్, భీమరాజు, గంగరాజు, తెల్లం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీడని వర్షం

తగ్గని వాగుల ఉధృతి

గల్లంతైన విద్యార్థిని మృతదేహం లభ్యం



జంగారెడ్డిగూడెంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో మంగళవారం కురిసిన భారీ వర్షంతో వీధులు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ఎర్రకాలువ జలాశయానికి వరద నీరు ఎక్కువగా రావడంతో మూడు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. ఫలితంగా పంగిడిగూడెం-రాజవరం మార్గంలో కాజ్‌వేపైకి నీరు ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయయి. కాజ్వే వద్ద ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా అధికారులు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముసునూరు: మండలంలోని ముసునూరు, చింతలవల్లి, కొర్లకుంట గ్రామాల నుండి నూజివీడు వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై రామిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మంగళవారం కూడా రాకపోకలు పునరుద్ధరించలేదు. ముసునూరు నుండి వలసపల్లి, గుడిపాడు, ముళ్లపూడి వెళ్లే ప్రధాన రహదారిపై సంధ్యవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరి, పత్తి వంటి పంటలు నీట మునిగాయి. తహశీల్దార్ డి.ప్రశాంతి, ఎస్ఐ ఎం.చిరంజీవి ఆయా కాజ్‌వేల వద్ద ఎవరూ ప్రమాదాల బారిన పడకుండా చర్యలు చేపట్టారు.

గల్లంతైన బి.ఫార్మశీ విద్యార్థిని మృతదేహం లభ్యం

నూజివీడు టౌన్: తుక్కులూరు గ్రామ హరిజనవాడకు చెందిన బి.ఫార్మసీ విద్యార్థిని బడిపాటి నీరజ (20) ఆదివారం ప్రమాదవశాత్తూ వాగులో కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న ఎస్‌డిఆర్ఎఫ్ బృందంచే గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం నీరజ మృతదేహం లభ్యమైంది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం నీరజ కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


టిడిపి మండలాధ్యక్షులు యనమదల వాసు

నీరజ కుటుంబ సభ్యులను ఆసుపత్రిలో టిడిపి మండల అధ్యక్షులు యనమదల వాసు సోమవారం పరామర్శించారు. బీమాగా రూ.ఐదు లక్షల సాయం అందించనున్నట్లు వెల్లడించారు. నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకటరామయ్య రూ.15 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం అందించినట్లు తెలిపారు. నీరజ మృతి విషయాన్ని మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన త్వరలోనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సాయం అందిస్తారని వాసు తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో హనీకి గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడో తరగతి విద్యార్థిని గుర్రం హనీ గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆమె తండ్రి గుర్రం నాగరాజు సోమవారం. తెలిపారు. మండలంలోని పుట్రేపు గ్రామానికి చెందిన గుర్రం నాగరాజు, భారతి దంపతుల చిన్న కుమార్తె హనీ చింతలపూడిలోని మేరీ ఇమ్మాక్యులేట్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. పాఠశాలలో కరాటే మాస్టార్ పి.సుమన్‌రాజ్ వద్ద శిక్షణ పొందిన కొందరు విద్యార్థులు ఈ నెల 14న ఆదివారం అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి 5వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హనీ బంగారు పతకం సాధించింది. ఆమెను పాఠశాల హెచ్ఎం సిస్టర్ సోఫియా, కరస్పాండెంట్ సిస్టర్ దినియ, పాఠశాల సిబ్బంది, పుట్రేపు గ్రామపెద్దలు అభినందించారు. చిన్నతనంలోనే కరాటేలో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందని హనీ సంతోషం వ్యక్తం చేసింది.



గోల్డ్ మెడల్ సాధించిన హనీ

యూరియా సమస్య పరిష్కరించాలని కాంగ్రెస్ ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలో యూరియాను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారని, అదేవిధంగా యూరియా కొరతతో రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవట్లేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత వల్ల రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా పంట నష్టపోయి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు సంభవించే అవకాశం ఉందన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బుచ్చిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజారత్నం, మాజీ ఎంఎల్ఎ ఎలిజా, నేతలు ఆలపాటి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని వంకవారిగూడెం ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా ఈ నెల 16వ తేదీ మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా పాలకుల నిరంకుశపూరితంగా నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రయత్నించడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను ఆహ్వానించినట్లు తెలిపారు.

ఆరాధ్యుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకుని 58వ ఇంజినీర్స్ డే కార్యక్రమాన్ని రాష్ట్ర ఇరిగేషన్ ఎన్‌జిఒస్ అసోసియేషన్, ఇంజినీర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎన్‌జిఒస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వంలో మైసూర్ సంస్థానంలో దివాన్‌గా పని చేస్తూ ఇంజినీర్‌గా ప్రసిద్ధి చెందిన విశ్వేశ్వరయ్య కావేరి నదిపై కృష్ణ రాజసాగర్ నిర్మించారని, నిజాం ప్రభుత్వంలో మూసి నదికి వరదలు వచ్చినప్పుడు హైదరాబాద్ నగరంలో మూసినది పరివాహక ప్రాంతంలో వరద నివారణ చర్యలు చేపట్టారని, విశాఖలో సముద్రపు అలలు ఒడ్డు దాటి రాకుండా తనకున్న ఇంజినీరింగ్ పరిజ్ఞానంతో అడ్డుకట్ట వేసిన గొప్ప ఇంజినీర్ విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీరు-ప్రగతి సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటస్వామి, పోలవరం కుడి ప్రధాన కాల్వ డిప్యూటీ ఎస్ఇ కె.రాజు, డిఇఇలు పి.గనిరాజు, దేవరకొండ వెంకటేశ్వర్లు, జెఇఇలు దేవర రాజశేఖర్, మాధవరావు, ఎన్‌జిఒ నేతలు నెరుసు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అదానీ స్మార్ట్ మీటర్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగం నుండి తొలగించిన తమ ఆరుగురికి జూన్ నెల జీతంతో పాటు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ అదానీ గ్రూప్ స్మార్ట్ మీటర్స్ కంపెనీ (హెచ్ఆర్ టాలెంట్ సొల్యూషన్) ఉద్యోగులు సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సాయి నాగేంద్ర, శేఖర్ మాట్లాడుతూ హెచ్ఆర్ టాలెంట్ సొల్యూషన్స్ ఏలూరు డివిజన్‌లో జూనియర్ ఇంజినీర్లు, సూపర్‌వైజర్లుగా తంగెళ్లమూడిలోని జెఎన్ఆర్ గొడౌన్స్‌లో జూన్ వరకు పని చేశామని, జూన్ 19న క్లాజ్ 11 అనే కారణంచేత ఉద్యోగం నుంచి తొలగించారని, జూన్‌లో రావాల్సిన జీతం, 8 నెలలుగా పని చేసిన కాలానికి కాండాక్ట్ సర్టిఫికెట్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిపారు. దీనివల్ల వేరేచోట ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందని వాపోయారు. జూన్ జీతం, సర్టిఫికెట్ల గురించి కంపెనీ సర్కిల్ హెడ్‌ను సంప్రదించినా ఆయన పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.




తమ కష్టాలు చెప్పుకుంటున్న ఉద్యోగులు

సిఐటియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు జిల్లా నూతన అధ్యక్షులుగా ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శిగా డిఎన్‌విడి.ప్రసాద్ ఎన్నికయ్యారు. నూజివీడులో ఆదివారం ముగిసిన సిఐటియు 13వ జిల్లా మహాసభలో 19 మందితో ఆఫీస్ బేరర్స్, 64 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలను సోమవారం జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మీడియాకు విడుదల చేశారు. జిల్లా కోశాధికారిగా ఐవి.సుధాకర్, ఉపాధ్యక్షులుగా పి.భారతి, ఎన్.రమణారావు, ఆర్‌విఎస్.నారాయణ, ఎస్.రాంబాబు, కెవికెఎస్.ప్రసాద్, ఎం.నాగమణి, ఎం.దుర్గారావు పి.సూర్యారావు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులుగా జి.రాజు, కె.పోసమ్మ, వై.సాయికిరణ్, ఎం.ఇస్సాక్, కె.శ్రీనివాస్, జె.గోపి, టి.మాణిక్యం, జె.మహేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన మహాసభలో జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు చర్చించామని, వాటి పరిష్కారానికి రానున్న కాలంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహించాలని తీర్మానించామన్నారు. జిల్లాలో పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని తీర్మానించామన్నారు. ఏలూరులో వేలాది మంది కార్మికులకు ఉపయోగపడేలా ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని మహాసభల్లో తీర్మానించామన్నారు. లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేసి కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో ఉన్న కనీస వేతనాల జిఒలను వెంటనే సవరించాలని, స్కీమ్ వర్కర్లు అంగన్వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్, వెలుగు విఒఎ, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు తక్షణమే పునరుద్ధరించాలని, రవాణారంగ, హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహాసభల్లో తీర్మానించినట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకంలో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లు అందరికీ రూ.25 వేలు పరిహారం చెల్లించాలని కోరుతూ ఈ నెల 18న విజయవాడలో జరిగే ధర్నాలో రవాణా రంగ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని మహాసభలో పిలుపునిచ్చినట్లు తెలిపారు.



లింగరాజు ప్రసాద్

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఉంటుందని, ప్రజలు ముఖ్యంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి ప్రతాప్ శివకిశోర్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో 48 ఫిర్యాదులు అందాయి. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎస్‌పి సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. సైబర్ నేరాలపై సైబర్ సెల్ ఎస్ఐ పద్మ అవగాహన కల్పించారు. ఫిర్యాదుదారులకు ఏలూరులోని శ్రీ సత్యసాయి సేవా సంఘం మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసింది.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

నూజివీడు టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 23 అర్జీలు అందించినట్లు తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు అధికారుల గైర్హాజరు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ఫిర్యాదుదారులకు ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అధికారులు లేకపోతే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు.

పట్టిసీమ నుంచి 354 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 708 క్యూసెక్కుల నీటిని పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిఇ సురేషబాబు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా డెల్టాల రైతుల అవసరాల మేరకు నీటి పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ట్రైకార్ ఛైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పూలికపాడు గ్రామానికి చెందిన పాలడుగుల చెన్నయ్య, పచ్చిగాల వరలక్ష్మిలు రెండు రోజుల క్రితం కూలి పనులకు వెళ్లి వస్తుండగా తిరిగి వస్తుండగా వాగు ఉధృతికి గల్లంతయ్యారు. చెన్నయ్య మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు సోమవారం ఇంటికెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉన్న గోశాలలో ఆవులకు సోమవారం గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశు వైద్య సిబ్బంది, గోశాల సిబ్బంది పాల్గొని మొత్తం 250 ఆవులకు, 54 దూడలకు టీకాలు వేశారు. ద్వారకాతిరుమల గ్రామ పరిధిలో 120 గేదెలకు, 30 ఆవులకు కూడా టీకాలు వేశారు.


కొయ్యలగూడెం : రైతులంతా పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్‌లను తప్పనిసరిగా వేయించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్డి మేఘాదేవి తెలిపారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో పశు వైద్యశాల ఆవరణ వద్ద గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎంపిపి గంజిమాల రామారావు ప్రారంభించారు.

ముసునూరు : గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పశువులకు టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట్ చైతన్య తెలిపారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో 155 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామాల పశు పోషణ దారులు ఆయా గ్రామాల్లోని సచివాలయ వైద్య సిబ్బందిని సంప్రదించి టీకాలు వేయించుకోవాలని కోరారు.

ప్రజల పక్షం 'ప్రజాశక్తి'

ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన తహశీల్దార్ గోపాల్

ప్రజాశక్తి - మండవల్లి



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పక్షం అనే అక్షర సత్యమని తహశీల్దార్ గోపాల్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆయన సోమవారం సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి వాస్తవ ప్రజా సమస్యలను వెలికి తీయడంలో ప్రజాశక్తి ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ రేగేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించాలని వినతి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా సచివాలయంలో సిబ్బంది లేకపోవడం అత్యంత బాధాకరమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు విమర్శించారు. మండల కేంద్రమైన మండవల్లి సచివాలయంలో కొన్ని కార్యదర్శులను డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరుతూ రెవెన్యూ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ కె.గోపాల్‌కు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు అర్జీతో విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పర్మినెంట్ కార్యదర్శిని, డిజిటల్ అసిస్టెంట్ టీను నియమించాలని కోరారు. ప్రజాస్వామ్య ఐక్యవేదిక మండలాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.అర్జున్‌రావు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి ఏలూరు సిటీ

వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు మెంటావారిపేట, ఏడీగిజ్జు ప్రాంతంలో మెంటావారిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్ష నిర్వహించారు.

'పేదల పెన్నిధి సిఎం సహాయ నిధి'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సిఎం సహాయ నిధి నిరుపేదలకు పెన్నిధి వంటిదని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని బర్రింకలపాడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో 23 మందికి రూ.19 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో టి.నర్సాపురం మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, నాయకులు సొంగు, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన మడకం శంకర్‌కు రూ.61,774 సిఎం సహాయ నిధి చెక్కును ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కుర్సం క్రాంతి కుమార్, రామవరం ఎంపిటిసి సభ్యులు సోయం చంద్రరావు, గుండిరెడ్డి శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మోసాల పట్ల అప్రమత్తత అవసరం

ఆగిరిపల్లి : విద్యార్థులు సమాజంలో జరిగే పలు రకాలైన మోసాల పట్ల జాగ్రత్తగా ఉండటంతో పాటు మహిళల పట్ల గౌరవంగా మెలగాలని ఆగిరిపల్లి ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. మండల పరిధిలోని ఈదర శ్రీపతి పరిధిలోని విద్యార్థులకు మహిళల పట్ల జరిగే నేరాలు, సైబర్ మోసాలు, గుడ్, బ్యాడ్ టచ్, రోడ్డు భద్రతా నియమాలు, డయల్112 అత్యవసర సేవల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మస్తాన్‌రావు మృతికి సంతాపం

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి నూజివీడులో గత 16 ఏళ్లుగా కెమిస్ట్రీ అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ జక్కా మస్తాన్‌రావు ఈనెల 13వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది సంతాపం తెలిపారు. ఎస్ఎసి ఆడిటోరియంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించరూ..!

పెయ్యేరు అలేఖ్య విలాస్ వాసుల వేడుకోలు
పట్టించుకోని పంచాయతీ పాలకవర్గం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు అలేఖ్య విలాస్ నివాసితులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ముదినేపల్లి -గుడివాడ వెళ్లే రోడ్డులో పెయ్యేరు గ్రామ పంచాయతీ పరిధిలో 2014లో అలేఖ్య వెంచర్ ఏర్పాటైంది. సుమారు 80 కుటుంబాలు, 200 పైలుకు జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. ఇక్కడ నివాసితులు గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీకి పన్నులు చెల్లిస్తూ సదరు గృహాల్లో కాపురం ఉంటున్నారు. సదరు వెంచర్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 20 కుటుంబాలు ఉంటున్నాయి. ముదినేపల్లి - గుడివాడ మెయిన్ రోడ్డు నుంచి అలేఖ్య నివాసాలకు రాకపోకలు నిమిత్తం ఏర్పాటు చేసిన మురుగు బోదెకు ఉన్న వంతెనను ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులు తొలగించడంతో నివాసితులకు రాకపోకలకు దారి లేకుండా పోయింది. ఈ విషయమై పంచాయతీ పాలకవర్గానికి మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో నివాసితులంతా కలిసి తాత్కాలికంగా బోదెకు తూములను ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. గుర్తుతెలియని తెలియని వ్యక్తులు తూములను గత 20 రోజుల క్రితం జెసిబితో పీకి వేయించి పక్కకి పడేశారని నివాసితులు చెబుతున్నారు. బోదెపై పక్కా (బ్రిడ్జి) నిర్మించాలని పంచాయతీ పాలకవర్గాన్ని, కార్యదర్శిని పలు సార్లు కోరినా ఏవిధమైన సమాధానం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజకీయ గ్రామ పెద్దలు మీకు మా పంచాయతీలో ఓటు హక్కు లేదని, ఏ పని చేయం, చేయని య్యం అంటూ బెదిరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గత ఏడేళ్ల నుంచి డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో 33 అడుగుల వెడల్పు జబర్లలో చెట్లు పుక్కాళ్లై పెరిగి దారులు లేకుండా, పారిశుధ్య లోపం, ఆక్రమణలతో పాములు, వర్షాకాలంలో మురుగునీరు పోయే మార్గం లేక దోమలతో అనారోగ్యాలు సంభవిస్తున్నాయని చెబుతున్నారు. వెంచర్‌లోని కొన్ని కుటుంబాలకు విద్యుత్ వీధి స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో కరెంటు సౌకర్యం లేదని వాపోతున్నారు.



అలేఖ్య వెంచర్


వర్షాలు పడుతుండడంతో విషసర్పాలు ఇళ్ల పరిసరాల్లో తిరుగడం వల్ల పిల్లలను స్కూళ్లకు పంపించేందుకు భయాందోళనకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పెయ్యేరు పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఈనెల పదో తేదీ విచారణకు వచ్చిన ఏలూరు డిఎల్‌పిఒ అమ్మాజీని కలిసి తమ సమస్యలను వివరించామన్నారు. డిఎల్‌పిఒ స్పందిస్తూ అలేఖ్య వెంచర్ ఎంక్వైరీ నిమిత్తం ఇద్దామిన్ని పంపుతామని, సమస్యలను పరిష్కరించాలని సదరు కార్యదర్శికి డిఎల్‌పిఒ అమ్మాజీ ఆదేశాలు ఇచ్చినప్పటికి నేటికీ ఒక సమస్య కూడా కార్యదర్శి పరిష్కరించలేదని నివాసితులు చెబుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరులో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు అలేఖ్య వెంచర్ నివాసితులు తెలిపారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్ అందజేత

ముసునూరు : టిడిపి తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వజ్జ రామారావు ఆర్థిక సహకారంతో ఆతని తల్లి వజ్జ సత్యవతి జ్ఞాపకార్థంగా మద్యాయిగుంట మోడల్ ప్రైమరీ స్కూల్‌కు రూ.11 వేల విలువైన అహుజా సౌండ్ బాక్సును హెచ్ఎం యువరాజుకు అందించారు. టిడిపి నాయకులు తిరుమలరెడ్డి నాగరాజు సంధాన కర్త ద్వారా ఈ సౌండ్ బాక్సును సమకూర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.భాస్కరరావు, ఛైర్మన్ శివరామకృష్ణ, టిడిపి గ్రామ నాయకులు టి.నాగరాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అదిర్నేని పద్మకరరావు, ఉపాధ్యాయులు అనురాధ, జ్యోతి, జయప్రద పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరు : తేజను సత్కరిస్తున్న ప్రముఖులు

ఇంజనీర్స్ డే సందర్భంగా ది ఏలూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు శ్రీసోమ కన్‌స్ట్రక్షన్స్, కన్సల్టింగ్ సంస్థ ఎండి డాక్టర్ సూరతేజను ఉత్తమ యువ ఇంజనీర్‌గా శాలువ, మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ టి.శివనారాయణ, సెక్రటరీ కె.బాలసుబ్రహ్మణం, ట్రెజరర్ జి.వసంత్‌కుమార్, సభ్యులు కె.ప్రసాద్, ఎం.రామారావు, ఎస్.సాయిరాం, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి నూజివీడులోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని మద్ది రుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంజనీర్స్ డే ను సోమవారం ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి : భారతదేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో ప్రత్యేకమైనదని ప్రొఫెసర్ సుధాకరుడు విజయకుమార్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యువ ఇంజనీర్లు పి.నాగబాబు, ఎం.ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసిపి నేత ఇంటి ఎదుట వడ్డిగూడెం వాసుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని కట్టా సుబ్బారావు తోటలో ఉన్న రామరాజు హైట్స్ వద్ద వైసిపికి చెందిన కొర్లేరు నాయకుడు మోరు రామరాజు ఇంటి వద్ద పెదపాడు మండలం వడ్డిగూడెం గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వైసిపి నేత మోరు రామరాజు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ 15 ఏళ్ల క్రితం 560 మంది గ్రామస్తుల వద్ద నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.10,200 తీసుకున్నారని, ఇళ్ల స్థలాలు ఇప్పించకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చెల్లించాల్సిన రూ.57 లక్షల సొమ్మును ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోజుల్లో రామరాజును పిలిచి మాట్లాడతానని త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

వల్లిభద్రుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విజయరత్నబాబు ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు హిందీ భాషకు సంబంధించిన నాటికలు, పాటలు పాడారు. హిందీ భాష కోసం పాటుపడిన కవులు కబీర్ దాసు, మీరాబాయి, సుభద్ర కుమారి, చౌహాన్, తులసీదాస్ వేషాల్లో పిల్లలు ఆకట్టుకున్నారు. హిందీ ఉపాధ్యాయులు షేక్ హుస్సేన్, డి.అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక పవర్‌పేటలోని హిందీ నికేతన్‌లో విద్యార్థులకు హిందీ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసినట్లు హిందీ నికేతన్ కార్యదర్శి పి.శివకామేశ్వరి తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు సత్యనారాయణ చిత్రపటానికి పూల మాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిందీ నికేతన్ అధ్యక్షులు వి.వెంకటస్వామి, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన మాజీ ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని పాత బస్టాండ్ వద్ద ఉన్న మెడికల్ కళాశాలను దెందులూరు మాజీ ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి, వైసిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ సోమవారం సందర్శించారు. తెలంత కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రారంభించి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మెడికల్ కాలేజీని సందర్శించి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడిదేశి శ్రీను, జుజ్జువరపు విజయనిర్మల, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం : అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, పలువ ఆదివాసీ పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య డిమాండ్ చేశారు. గిరిజన వలస గిరిజన సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం జంగారెడ్డిగూడెం డివిజన్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జీలుగుమిల్లి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరత్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు పూర్తిగా నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు

విజిలెన్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్, మండల వ్యవసాయాధికారి చందుశేఖర్ ఆధ్వర్యంలో ముసునూరు, చెక్కపల్లి, గోపవరం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను జిల్లా రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి.కన్యాకుమారి సోమవారం తనిఖీ చేశారు. గోపవరంలో కోరమండల్ ఎంటర్ ప్రైజస్ ఎరువుల దుకాణంలో వ్యత్యాసం గుర్తించి ఎరువులను సీజ్ చేశారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురంలో 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ సిఐ పి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కృష్ణాపురంలో ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో భూక్యా సర్వేశ్వరావు, భూక్యా రాజులకు సంబంధించిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అధ్వాన రోడ్డు అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురంలో అంబేద్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు అభివృద్ధి చేయా లని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపిడిఒ నగరాజకు మారి, తహశీల్దార్ టి.సాయిబాబాకు వినతిపత్రం అందించారు. సామాజిక కార్యకర్త ఎస్‌డి.నాసర్ పాషా మాట్లాడుతూ రోడ్డును అభివృద్ధి చేయాలని, డ్రైనేజీ నిర్మించాలని కోరారు. జమీల బేగం, సామాజిక కార్యకర్తలు కొరిచి వెంకటేశ్వర రావు, కొరిచి నాగేశ్వరరావు, మధు, రెడ్డి శ్రీనివాస్, బొడ్డపాటి రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.